# సాక్షి చిత్తూరు

సోమవారం । 16 । అక్టోబర్ । 2023






## జిల్లా క్రీడా జట్ల ఎంపిక

ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ, టెన్నిస్ అండర్–19 బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు.

- 8లో



## వెంకటగిరికి జాతీయ ఖ్యాతి

వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అందించనున్న అవార్డుల రేసులో వెంకటగిరి చేనేత చేరింది.

- 8లో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 32 | 22 |
| తిరుపతి | 34 | 23 |
| తిరుమల | 28 | 18 |
| గూడూరు | 35 | 25 |
| నగరి | 33 | 23 |

## న్యూస్‌రీల్

### గణనాథుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రవీంద్రబాబుకు జ్ఞాపిక అందిస్తున్న ఈఓ

**కాణిపాకం(యాదమరి):** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో ఆలయానికి విచ్చేశారు. ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అధికారులు అందించారు.

### నేడు కలెక్టరేట్‌లో స్పందన

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

**పోలీసు కార్యాలయంలో..**

**చిత్తూరు అర్బన్:** నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయం లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడ వచ్చని పేర్కొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం



భోజనం నాణ్యత పరిశీలిస్తున్న డీడీ రాజ్యలక్ష్మీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సోషల్ వెల్ఫేర్ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో వసతి గృహాల వంట మనుషులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భోజనంలో నాణ్యత తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎటువంటి అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు. నిత్యావసర సరుకులను సకాలంలో అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం వంటమనుషులు వండిన ఆహార పదార్థాల రుచి చూసి ఆమె నాణ్యతను పరిశీలించారు. ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డెన్‌లు, వంట మనుషులు పాల్గొన్నారు.

### టెలిస్కోప్ తయారీపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

**తిరుపతి కల్చరల్:** భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఆదివారం పాఠశాలల విద్యార్థులకు ఖగోళ టెలిస్కోప్ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తుడా కార్యదర్శి ఎస్.లక్ష్మి, అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డీన్ కేవీ. రవికుమార్ హాజరై వర్క్‌షాపును ప్రారంభించారు. వారు టెలిస్కోప్ వర్క్‌షాప్ ప్రాముఖ్యతను తెలియజేశారు. డూ ఇట్ యువర్ సెల్ఫ్ –ఆన్ యాక్టివిటీ స్కిల్‌కు సంబంధించిన విషయాలను వివరించారు. విద్యార్థులకు టెలిస్కోప్ సంక్షిప్త చరిత్ర, రకాలు, పని సూత్రాలను వారు తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి తయారు చేసిన టెలిస్కోప్‌లను వారి పాఠశాలలకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్‌సెంటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస నెహ్రూ, సిబ్బంది. వివిధ ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి



పెద్ద శేష వాహనంపై స్వామివారికి విశేష హారతి



వాహనసేవను తిలకిస్తున్న భక్తులు



తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ తిరుమల శ్రీవారు భక్తకోటిని అనుగ్రహించారు. రాత్రి ఏడు తలల స్వర్ణ శేష వాహనంపై వైకుంఠనాథుడి అలంకరణలో ఊరేగుతూ కనువిందు చేశారు. వాహన సేవల ముందు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

# శేషశైలావాస..!

- అంగరంగ వైభవంగా తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- పెద్ద శేష వాహనంపై విహరించిన మలయప్ప
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన

**తిరుమల:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆగమోక్తంగా ఆరంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్ప స్వామివారు ఏడు తలల పెద్ద శేష వాహనంపై వైకుంఠ నాథుడి అలంకరణలో తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు బోర్డు సభ్యులు, జేఈఓ సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్ పాల్గొన్నారు.

### నేటి వాహన సేవలు

**ఉదయం చిన్న శేషవాహనం**

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 2వ రోజు సోమవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

**రాత్రి హంస వాహనం**

సోమవారం రాత్రి శ్రీమలయప్పస్వామివారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో దర్శనమిస్తారు.



టీటీడీ ఈవో ధర్మారెడ్డికి పరివట్టాన్ని అలంకరిస్తున్న వేద పండితుడు



వాహన సేవలో కళాకారుల ప్రదర్శన



క్షీర సాగర మథనం



పెద్ద శేష వాహన సేవలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు

## వైఎస్సార్ సీపీలోకి 20 టీడీపీ కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

**కుప్పంరూరల్:** కుప్పం మండలం, వరదరాజపురం గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన 20 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో కనుగు, వివేక్‌తో పాటు మరో 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు. వీరందరికి కండువాలు కప్పి ఎమ్మెల్సీ భరత్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా కనుగు, వివేక్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా టీడీపీలో ఉన్నామని, ఎలాంటి గుర్తింపు లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజాకర్షక పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కుప్పంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

## ఆరిమానిగంగమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

**శ్రీరంగరాజపురం :** మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లెలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణ స్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. వేకువ జామున అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఉదయం 9 గంటలకు శ్రీమహా గణపతి షోడశ పూజ, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నారాయణస్వామి, విజయానందరెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకులు, అధికారులు వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలను అందించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆలయాలను ధ్వంసం చేస్తే, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాలను పునర్నిర్మిస్తున్నారని తెలిపారు. శ్రీఆరిమాను గంగమ్మ ఆలయాన్ని రూ. కోటి 95 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. హరికథా కార్యక్రమం జరిగింది. సాయంత్రం అమ్మవారిని శైలపుత్రికగా సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఏకవీర ఫౌండేషన్ చైర్మన్ ప్రతాప్‌స్వామిజీ, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీపీ సరిత, ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఆలయ ఈఓ. తిమ్మారెడ్డి, ధర్మకర్త లింగారెడ్డి, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలను తీసుకువస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

## బోయకొండలో దసరా సందడి

- బాలా త్రిపురసుందరిగా అమ్మవారు దర్శనం

**చౌడేపల్లె:** కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా ప్రసిద్ధిగాంచిన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమైయ్యాయి. తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో వేదపండితులు గోవర్ధనశర్మ ఆధర్యంలో గణపతి పూజ, స్వస్తివాచనం, దేవనాంది, అమ్మవారికి అభిషేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి, సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, ఇమ్రాన్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

**నేడు పార్వతీదేవిగా**

దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. నిత్యం జరిగే శరన్నవ రాత్రి పూజల్లో భక్తులు రూ.5,116 చెల్లించి ఉభయదారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.



బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు



విద్యుద్దీపకాంతులీనుతున్న బోయకొండ ఆలయం

### శ్రీవారి దర్శనానికి 5 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 67,785 మంది స్వామివారిని దర్శించుకోగా 21,284 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 5 గంటల్లో, టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### వేదాలు మానవజాతికి మార్గదర్శకాలు

**తిరుమల:** మానవ జాతి ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి మార్గదర్శకాలు పవిత్ర గ్రంథాలు వేదాలు అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుమలలోని నాద నీరాజన వేదికపై ఆదివారం వేంకటేశ్వర ఉన్నత వేద అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస వేద విద్వత్ సదస్సు ప్రారంభోత్సవానికి టీటీడీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి వేద విజ్ఞానం పరిఢవిల్లుతోందన్నారు. వేద ప్రామాణికంగా నడుచుకుంటే నైతిక విలువలతో కూడిన జీవనం అలవడుతుందని తెలిపారు. ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ చిర్రావూరి శ్రీరామశర్మ వేదాలు బోధించే 'పంచా దశ సంస్కారాల' ప్రాముఖ్యతను వివరించారు. వేదం అజ్ఞానంలో ఉండే మానవుడిని విజ్ఞానం వైపు నడిపించడంతోపాటు సంస్కారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రత్యేకాధికారి డాక్టర్ విభీషణ శర్మ పాల్గొన్నారు.

## పంటలపై ఆగని గజ దాడులు



పెనుగొలకల సమీపంలో ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంట



పెద్దకాప్పల్లి సమీపంలోని కీలపట్ల బీట్‌లో మకాం వేసిన ఏనుగులు

**పెద్దపంజాణి:** మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లి, గౌరీనగర్, జిట్టంవారిపల్లి, ముదిరెడ్డిపల్లి, పెద్దకాప్పల్లి, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె పంట పొలాలపై ఏనుగుల గుంపు పదే పదే చొరబడుతూ పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయి. శనివారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి గుంపుగా వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామానికి చెందిన పలువురు రైతుల పంటలపై విరుచుకుపడి ధ్వంసం చేశాయి. రైతులు కోడిపల్లి బాలయ్య, సురేంద్ర, వెంకటరత్నం, రాజన్న తదితరులకు చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. సుమారు రూ.లక్ష మేరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. చేతికొచ్చిన పంటలను ఏనుగులు తొక్కి నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న రాయలపేట, చారాల ఫారెస్టు బీట్ ఆఫీసర్లు రవికుమార్, దొరస్వామి ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ట్రాకర్ల సహాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**కంటిపై కునుకు కరువు**

పెద్దకాప్పల్లి పంచాయతీ ప్రజలకు ఏనుగుల దాడులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వారం రోజులుగా ఏదో ఒక గ్రామంలో పంటలపై దాడులు చేస్తుండడంతో భయపడిపోతున్నారు. పగలంతా అటవీ ప్రాంతంలో ఉంటూ రాత్రి కాగానే ఏనుగులు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఏనుగులు ముగ్గురిని తొక్కి చంపేశాయి. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా కట్టడి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### దుష్ప్రచారం చేస్తే తగిన బుద్ధి చెబుతాం

● అతను వైఎస్సార్ సీపీ కార్యకర్త కాదు

**పూతలపట్టు:** పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉండడంతో టీడీపీ శ్రేణులు రాజకీయంగా ఎదుర్కోలేక సోషల్ మీడియాలో అవాస్తలతో దుష్ప్రచారం చేయడం గర్హనీయమని పార్టీ నాయకుడు, పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. 'టీడీపీ శ్రేణులపై వైసీపీ కార్యకర్త దాడి' శీర్షికన శుక్రవారం పచ్చనేతలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని ఎర్రచెరువుపల్లె హైస్కూల్ మైదానంలో నలుగురు స్నేహితులు, ఐరాల మండలానికి చెందిన వంశీ మధ్య గొడవలు జరగడంతో శనివారం ఐరాల ఎస్ఐ వెంకటేశ్వర్లు నలుగురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇందులో నిందితుడు విజయ్ వైఎస్సార్ సీపీ కార్యకర్తని టీడీపీ నాయకులు ప్రచారం చేయడం సరి కాదని తెలిపారు. ఆదివారం ఎల్లో పత్రికల్లో ప్రచురితమైన వార్తలు అవాస్తమని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం కొనసాగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇకనైనా అవాస్తవ ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**పూతలపట్టు:** పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ లక్ష్మి కథనం మేరకు.. పీలేరుకు చెందిన రామ్‌గవాస్కర్ కారులో చిత్తూరు నుంచి ఇంటికి బయలుదేరాడు. మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద ఎదురుగా మోటారు బైక్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు బైక్ నడుపుతున్న నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వెంకటగిరికి జాతీయ ఖ్యాతి

మగ్గం ద్వారా చీరను నేస్తున్న మహిళ (ఇన్‌సెట్) వెంకటగిరి పట్టు చీరలు



జరీ చీరలతో మహారాణులనే మురిపించిన వెంకటగిరి చేనేత ఖ్యాతి జాతీయ స్థాయిలో మార్మోగుతోంది. కేంద్ర ప్రభుత్వం అందించే వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రోడక్ట్ అవార్డు రేసులో మన చేనేత చేరింది. ఈ చేనేత వస్త్రాల పరిశీలనకు కేంద్ర బృందం ఈ నెల 17న వెంకటగిరి పట్టణంలో పర్యటించనుంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి నేత చీరలను పరిశీలించి తగిన హోదా ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో ఈ వెంకటగిరి చేనేత చరిత్రను, ప్రత్యేకతను తెలుసుకుందాం.

- అవార్డు రేసులో చేనేత వస్త్రాలు
- 17న వెంకటగిరికి ఢిల్లీ బృందం
- వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్‌కు రాష్ట్రంలో 12 రంగాలు

**తిరుపతి అర్బన్:** రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెంకటగిరి వస్త్రాలకు 150 ఏళ్ల చరిత్ర ఉంది. వెండి జరీ, ఆఫ్‌ఫైన్ జరీలను అమర్చి ప్రత్యేక శైలిలో చీరలు నేయడం ద్వారా ఇక్కడి చేనేత పరిశ్రమ జాతీయ స్థాయిలో ప్రసిద్ధి పొందింది. వెంకటగిరి చీరలను 17వ శతాబ్దంలోనే నెల్లూరుకు చెందిన వెలుగుగోటి రాజవంశీయులు ధరించేవారు. చీరకు రెండు వైపులా ఒకే డిజైన్ కనిపించే జాందనీ వర్క్‌తో నేయడంతోపాటు కాటన్ చీరలు చుట్టూ చంగావి రంగు చీరల తయారీకి వెంకటగిరి ప్రసిద్ధి. ఇక్కడ 22 సంఘాలు, 660 మంది సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే చేనేత వస్త్ర ప్రదర్శనల్లో, ఆప్కో వస్త్రాలయాల్లో ఈ చీరలకు మంచి డిమాండ్ ఉంది.



ఐఐహెచ్‌టీలో చేనేత చీరల డిజైనింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

**చీరల తయారీ విధానం ఇలా**

వెంకటగిరి చేనేత కార్మికులు చీరల తయారీలో క్రమపద్ధతి పాటిస్తుంటారు. ప్రధానంగా హాంక్ (చిలప) రూపంలో పత్తి, వెండి, బంగారు జరీలు, నాప్తాల్‌తోపాటు పత్తి శుద్ధీకరణ చేస్తారు. మరోవైపు హాంక్ కాటన్‌ను ఉడకబెట్టి, రాత్రంతా నానబెట్టి, కడిగి, రంగులు అద్దుతారు. అంతేకాకుండా తెల్ల చీరలకు బ్లీచింగ్ టెక్నిక్‌ని వాడడం, మానవ మూలకం, గ్రాఫ్ పేపర్ డిజైన్‌తోపాటు నేసిన వాటిలో లోపాలను సరిచేయడానికి మాస్టర్ వీవర్ ద్వారా తనిఖీ చేపట్టి నాణ్యత ప్రమాణాలు తెలుసుకోవడం వీరి ప్రత్యేకత.

**వెంకటగిరికి ఢిల్లీ బృందం**

కేంద్ర ప్రభుత్వానికి అనుబంధంగా ఇన్వెస్ట్ ఇండియా కమిటీ పర్యవేక్షణలో చేతివృత్తుల్లో ప్రత్యేక నైపుణ్యత సాధించడంతోపాటు గుర్తింపు పొందిన రంగాలకు ఈ ఏడాది నుంచి జాతీయస్థాయి అవార్డులను ప్రదానం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మన రాష్ట్రం నుంచి 12 రంగాలను ఎంపిక చేశారు. అందులో ముందు వరుసలో వెంకటగిరి చేనేత పరిశ్రమను జాతీయ అవార్డు పోటీలకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్ట్ ఇండియా కమిటీ ప్రతినిధి జిగీష తివారీ మిశ్రా నేతృత్వంలో ఓ బృందం ఈనెల 17వ తేదీ (మంగళవారం) వెంకటగిరిలో పర్యటించనుంది. వస్త్రాల నాణ్యతా, ప్రమాణాలపై నివేదిక రూపొందించనుంది.

### ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ

వెంకటగిరిలో చేనేత కార్మికుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని 1992లో భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించారు. ఏపీ హ్యాండ్లూమ్స్ – టెక్స్‌టైల్స్ కమిషనర్ అడ్మినిస్ట్రేటివ్ నియంత్రణలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన, ఈ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు అనేక రకాల కోర్సులు అందిస్తూ, ఉపాధి ఉద్యోగాల కల్పనలో ముందుంది. దీన్ని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వెంకటగిరి శాసనసభ్యుడుగా ఎంపికై రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా చేనేత కార్మికులు మరింత నైపుణ్యాన్ని సంపాదించుకోవడంతో పాటు వారు తయారు చేస్తున్న చేనేత వస్త్రాలకు ఏఏ రాష్ట్రాల్లో, డిమాండ్ ఉందో గుర్తించి, ఆయా ప్రాంతాలకు పంపడానికి ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుంది.





బంగారు, వెండి జరీ డిజైన్లు



ఇండియాలోనే ప్రసిద్ధి చెందిన ఐఐహెచ్‌టీ

**జాతీయ అవార్డు ఆశిద్దాం**



వెంకటగిరిలోని చేనేత ఉత్పత్తులు చీరలు, చేనేతల అభివృద్ధిని పరిశీలించేందుకు ఇన్వెస్ట్ ఇండియా కమిటీ ప్రతినిధి జిగీష తివారి మిశ్రా బృందం మంగళవారం వస్తోంది. వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రోడక్ట్‌లో భాగంగా కమిటీ చేనేత వస్త్రాల నాణ్యతా ప్రమాణాలు, ప్రత్యేకతలపై తనిఖీలు చేపట్టనుంది. అంతేకాకుండా కార్మికుల పోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని తెలుసుకోనుంది. కార్మికులతో ముఖాముఖి చర్చించనుంది. ఈ జాతీయ అవార్డు వెంకటగిరి చేనేతకు దక్కాలని ఆశిద్దాం.

-కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

**నేతన్నకు అండగా ప్రభుత్వం**



వెంకటగిరి చేనేత ఉత్పత్తులు వన్ డిస్ట్రిక్ వన్ ప్రోడక్ట్ 2023 పోటీకి ఎంపిక చేయడం హర్షణీయం. వెంకటగిరి చేనేత కార్మికుల ఉత్పత్తులకు దేశవిదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. అందుకు తగినట్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్న నేస్తం పేరుతో ప్రోత్సాహం అందిస్తూ కార్మికులకు అండగా నిలుస్తోంది. దీంతో కార్మికులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. వెంకటగిరి చేనేత ఉత్పత్తులకు జాతీయ అవార్డు రావాలని కోరుకుంటున్నాం.

-నక్కా వెంకటేశ్వరరావు, డైరెక్టర్, పద్మశాలి కార్పొరేషన్

**ప్రభుత్వ ప్రోత్సాహం మెండుగా ఉంది**



వెంకటగిరి చేనేత కార్మికులకు ప్రభుత్వం సాయం మెండుగా ఉంది. నేతన్న నేస్తంతో పాటు ప్రభుత్వం కార్మికులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తోంది. ప్రధానంగా అర్హులందరికీ సిఫార్సు లేకుండా పథకాలను అందజేస్తోంది. నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలబడింది. దానికి తగినట్లుగా నేత కార్మికులు మరింత ఉత్సాహంగా చీరలునేస్తున్నారు. వెంకటగిరికి వస్తున్న ఢిల్లీ బృందానికి ఇక్కడి ప్రత్యేకతలను, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వివరంగా చెబుతాం.

-ఎన్.విజయకుమార్, చేనేత కార్మికుడు, వెంకటగిరి

**నిశిత పరిశీలన**



వెంకటగిరి చేనేత వస్త్రాలను నిశితంగా పరిశీలించడానికి ఢిల్లీ బృందం మంగళవారం రానుంది. అన్ని అంశాలను వారు నిశితంగా పరిశీలించి, నివేదికను అందిస్తారు. వెంటగిరి చేనేత ఉత్పత్తులతోపాటు రాష్ట్రంలో 12 రంగాలను ఎంపిక చేశారు. బృందం కార్మికులతోనూ నేరుగా మాట్లాడుతుంది. ఆ మేరకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాం. కార్మికులందరూ కమిటీకి పూర్తి సహకారం అందించాలని కోరుతున్నాం.

-బీపీ రావు, అసిస్టెంట్ డైరెక్టర్, హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్, తిరుపతి జిల్లా



## అలరించిన అర్జున తపస్సుమాను

**తవణంపల్లె:** మండల కేంద్రంలోని శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అర్జున తపస్సుమాను ఘట్టం విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో ప్రత్యే పూజలు జరిగాయి. మధ్యాహ్నం తపస్సుమాను ఘట్టం ప్రారంభమైంది. మహేశ్వరుని వరం పొందేందుకు అర్జున వేషధారి తపస్సు మాను అధిరోహించారు. పద్యాలు ఆలపిస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతూ తపస్సుమాను అధిరోహించారు. తపస్సు మాను పైనుంచి వీబూదిపండ్లు, బిల్వం ఆకులు, నిమ్మపండ్లు కిందికి విసరగా, భక్తులు వాటిని అందుకునేందుకు పోటీ పడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సు మాను వద్ద వర పడ్డారు. పెద్దసంఖ్యలో జనం విచ్చేయడంతో సందడి నెలకొంది.



అర్జున తపస్సుమాను ఘట్టాన్ని తిలకిస్తున్న జనం

## నేడు బోయకొండ పాలక మండలి ప్రమాణ స్వీకారం

**చౌడేపల్లె:** పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని దేవస్థానం ఈఓ చంద్రమౌళి తెలిపారు. చైర్మన్‌గా నియమితులైన నాగరాజారెడ్డి, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డితో కలిసి ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఏర్పాట్లపై చర్చించారు. చైర్మన్‌తో పాటు సభ్యులు 10 మంది, ఎక్స్‌అఫిషియో సభ్యుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు హాజరు కానుండడంతో ఆలయం ప్రాంగణలో సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. చైర్మన్‌గా నాగరాజారెడ్డి, సభ్యులుగా పి.రజని, కె.రామ్‌దాస్, జి.భారతి, ఏ.రాజేష్, ఎం. బుడ్డమ్మ, ఎస్.పవన్‌కుమార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, సి.లక్ష్మీదేవమ్మ, కె.హైమావతి , డి.రెడ్డెమ్మ, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా గంగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



ఈఓతో కలిసి ఏర్పాట్లపై చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి (ఇన్‌సెట్) చైర్మన్‌గా నియమితులైన నాగరాజారెడ్డి

## బాలికపై కత్తితో దాడి

**వి.కోట:** పట్టణంలో పూల వ్యాపారి అశ్వర్థనారాయణ కుమార్తెపై గుర్తు తెలియని వ్యక్తి కత్తితో గొంతుపై దాడి చేయడం ఆదివారం సంచలనం రేపింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని నారాయణ నగర్‌కు చెందిన అశ్వర్థనారాయణ వైఎస్సార్ సర్కిల్‌లో పూల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు 14 ఏళ్ల కుమార్తె ఉంది. ఆదివారం ఉదయం బాలిక ఇంటి ముందు నిలబడి ఉండగా మంకీక్యాప్ ధరించి ఉన్న వ్యక్తి హఠాత్తుగా వచ్చి కత్తితో గొంతు కోసి పారిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన బాలిక తెలివిగా తప్పించుకోవడంతో స్వల్పగాయంతో బయటపడింది. స్థానికుల సాయంతో బాలికను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన బాలిక

### ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**తిరుపతి మంగళం :** శేషాచలం నుంచి అక్రమంగా తరలిపోతున్న ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటవీక్షేత్రాధికారి లోకేష్ కథనం మేరకు, ఆదివారం కరకంబాడి నుంచి మామండూరు మార్గంలోని ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాలపల్లి నుంచి ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్దకు రాగానే కొంతమంది ఈచర్ లారీని వదిలిపెట్టి పారిపోయారు. ఆ లారీని చెక్ చేయగా అందులో 36 ఎర్ర చందనం దుంగలు ఉన్నాయని చెప్పారు. వెంటనే లారీతో సహా 36 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాహనంతో సహా ఎర్రచందనం విలువ సుమారు రూ.కోటి ఉంటుందని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో రవీంద్ర, ఎఫ్‌బీవోలు లక్ష్మీదేవమ్మ, వెంకటేశ్వరరావు, కె.అరవింద్, పి.సురేష్‌బాబు, చెక్‌పోస్ట్ వాచర్ ప్రసాద్ పాల్గొన్నారు.



ఎర్రచందనాన్ని పట్టుకున్న అధికారులు

### యజ్ఞ స్థల పరిశీలన

**తిరుపతి కల్చరల్:** అలిపిరి వద్దనున్న సప్తగో ప్రదక్షిణ మందిరం ప్రాంగణంలో శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ విశేష యజ్ఞం నిర్వహణ కోసం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ప్రపంచ వ్యా ప్తంగా నున్న హిందువులు తమ శుభకార్యాలు, విశేషమైన రోజుల్లో స్వామివారి అనుగ్రహం కోసం సంకల్పం చెప్పుకుని యజ్ఞం నిర్వహించుకునేలా టీటీడీ ధర్మకర్తల మండలి ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సప్తగో ప్రదక్షిణ మందిరం వద్దనున్న స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా యజ్ఞ నిర్వహణకు అవసరమైన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చెన్నై స్థానిక సలహా మండలి చైర్మన్ శేఖర్‌రెడ్డి, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



యజ్ఞ స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, అధికారులు

### హక్కుల పరిరక్షణకు కృషి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

**తిరుపతి సిటీ :** మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డీఆర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో ఆదివారం నిర్వహించిన హ్యూమన్ రైట్స్ రాష్ట్రస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల విషయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నా రు. హ్యూమన్ రైట్స్ జాతీయస్థాయిలో విస్తృతంగా పనిచేస్తోందని, హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ కమిటీ అక్కడ సంపూర్ణ మద్దతు ఇస్తూ అండగా నిలబడుతోందన్నారు. సమావేశంలో హైకోర్టు సీనియర్ అడ్వకేట్ బుల్లెట్ రవి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెంగమేష్ చౌదరి, అధ్యక్షులు లక్ష్మీకాంత్, బాబూజీ, మీడియా సెక్రటరీ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, చంద్ర, సుమంత్, సురేంద్ర, విక్టోరియా, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### జాలర్లపై స్పీడ్ బోట్ల దాడి

**వాకాడు:** మండలంలోని తూపిలిపాళెం సముద్రంలో పొరుగు ప్రాంతాలకు చెందిన స్పీడు బోట్లతో స్థానిక జాలర్లపై దాడులు చేస్తున్నట్లు మత్స్యకారులు వాపోయారు. వారు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, తూపిలిపాళెం వద్ద సముద్రంపై ఇంజిన్ బోట్ల పరిధిని దాటి పొరుగు ప్రాంతాలైన తమిళనాడు, రామేశ్వరం, తూత్తుకుడి, నాగలాపురానికి చెందిన స్పీడు బోట్లు అధిక సంఖ్యలో వేట సాగిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్పీడు బోట్లు తీరం నుంచి 8 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంపై వేట సాగించాల్సి ఉందన్నారు. అయితే వారి పరిధిని దాటి తీరం అంచుకు వచ్చి వేటాడుతున్నారని, స్థానిక మత్స్యకారుల బోట్లపై రాళ్లతో దాడి చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై గతంలో జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు వివరించారు.

### అలరించిన నృత్య ప్రదర్శనలు

**తిరుచానూరు(చంద్రగిరి):** వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. తిరుపతికి చెందిన నటరాజ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, నాట్య గురువు పుష్ప ఆధ్వర్యంలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు తన్మయి, లోకిత, కార్తీక, జశ్విత, నిశిత, జాహ్నవి, భవిష్య, జానవి, షర్మిల తమ నృత్య ప్రదర్శనలతో మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు.

## జిల్లా క్రీడా జట్ల ఎంపిక

**తిరుపతి ఎడ్యుకేషన్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలగుంట క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల,బాలికల కబడ్డీ, టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కబడ్డీ కోచ్‌లు చైతన్య, అమ్ములు, నీలిమ, సాయిసుమతి, డిల్లీ, సుధాకర్ నేతృత్వంలో సాగిన ఈ పోటీల్లో సత్తా చాటిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. పీడీలు సురేంద్రారెడ్డి, స్వాతి, రామచంద్ర, శైలజ, హరిణి పాల్గొన్నారు. కోచ్ రాజు ఆధ్వర్యంలో టెన్నిస్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన బాలబాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు.

**కబడ్డీ బాలికల జట్టు**

తులసి, కావేరి, ఐశ్వర్య, పావని, సంజన, ఉష, చారుమతి, యామిని, సుజిత, సుప్రియ, సౌందర్య, వై.సుప్రియ, భువనేశ్వరి, తేజ, భవ్యశ్రీ, వాసవి, మునివేణి

**కబడ్డీ బాలుర జట్టు**

హర్షవర్ధన్‌రెడ్డి, అనిల్, భార్గవ్‌కుమార్, జ్ఞానేంద్రరెడ్డి, వెంకటతేజ, లక్ష్మీనరసింహ, ధనుష్, మిథున్, సునీల్, దేవేష్, శ్రావణ్‌కుమార్, తిరుమలేష్, కుమార్, నరసింహులు



టెన్నిస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

## బ్రహ్మోత్సవాల్లో 14 రాష్ట్రాల కళాకారులు

**తిరుమల:** శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో 14 రాష్ట్రాలకు చెందిన కళాకారులు వాహనసేవల్లో ప్రదర్శనలిచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు ఆదివారం తిరుమల అన్నమయ్య భవనంలో ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మరింతగా భక్తులను ఆకట్టుకునేలా కళారూపాలను ఎంపిక చేశామన్నారు. కళాబృందాల ప్రదర్శన వీడియోలను ముందుగానే తెప్పించుకుని, పరిశీలించి, ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, అసోం, మధ్యప్రదేశ్, గుజరాత్, హర్యానా, పశ్చిమబెంగాళ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, మణిపూర్ తదితర రాష్ట్రాల నుంచి కళాబృందాలు వస్తున్నట్టు జేఈవో వెల్లడించారు. ఆయా రాష్ట్రాల సంప్రదాయ నృత్యంతో పాటు జానపద నృత్యాలు, స్థానికులైన తిరుమలలోని బాలాజీ నగర్, తిరుపతికి చెందిన పలు కళాబృందాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు ఆంధ్రప్రదేశ్, రెండవ రోజు కర్ణాటక, మూడవ రోజు తమిళనాడు, నాలుగోరోజు తెలంగాణ, ఐదోరోజు గరుడసేవలో అన్ని రాష్ట్రాల కళాబృందాలు, మిగతా రోజుల్లో కొన్ని రాష్ట్రాలు కలిపి కళాప్రదర్శనలు ఉంటాయని వివరించారు. టీటీడీ ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ఉదయం, రాత్రి వాహనసేవల్లో సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తారని తెలిపారు. వీరితోపాటు ఎస్వీ బాలమందిరం విద్యార్థులు కోలాటం, బర్డ్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ల బృందం వేషధారణ ఉంటాయన్నారు. వాహనసేవలతోపాటు తిరుమలలోని ఆస్థానమండపం, నాదనీరాజనం, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణి వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇదలా ఉంచితే, సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో కళాప్రదర్శనలు చాలా బాగున్నాయని కర్ణాటకకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు, అమెరికా నుంచి కూడా భక్తులు అభినందనలు తెలియజేశారని, ప్రస్తుత కళాప్రదర్శనలు మరింత బాగా నిర్వహించడానికి వారి అభినందనలు తమలో ఉత్సాహాన్ని నింపాయన్నారు. సమావేశంలో హిందూ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, ఏఈఓ శ్రీరాములు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, అర్చక శిక్షణ కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఈఓ సదా భార్గవి